క్లుప్తంగా

నేడు జాయ్ అల్లూకాస్ షోరూం ప్రారంభం

కుత్బుల్లాపూర్: జాయ్ అల్లూకాస్ నూతన షోరూంను ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్రలో ప్రారంభించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 16న నిజాంపేట్ సప్తపది గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్రకార్మిక శాఖమంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్పొరేటర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు సరన్‌నగర్‌లో టెడెక్స్ ప్రదర్శన

బంజారాహిల్స్: దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ (డీఈఐ), డీమ్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల ప్లేస్‌మెంట్ అసిస్టెంట్స్ సెల్ (అపాక్) ఆధ్వర్యంలో ఆదివారం కొంపల్లి సైనిక్‌స్కూల్ సమీపంలో ఉన్న సరన్‌నగర్ కాలనీ ఫేజ్–2లో ప్రత్యేక ఎగ్జిబిషన్ (టెక్స్‌టైల్స్ అండ్ డ్రెస్ ఎగ్జిబిషన్–టెడెక్స్) ఏర్పాటు చేసినట్లు రాధాస్వామి సత్సంగ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు ప్రవేశం ఉచితమన్నారు. తెలంగాణ టెక్స్‌టైల్స్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందుమతి ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని, హ్యాండీక్రాఫ్ట్స్, టెక్నికల్, ట్రైనింగ్ హెడ్ ప్రొఫెసర్ పరుల్ భట్నాగర్ కూడా ఈ ప్రదర్శనకు హాజరవుతారని తెలిపారు. టెడెక్స్, డీఈఐకి చెందిన దుస్తుల డిజైనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ కోర్సుల వ్యవస్థాపకులు, విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శిస్తారని, విక్రయాలు కూడా ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన ద్వారా మహిళా సాధికారత, జీవనోపాధికి కృషి చేస్తున్నామన్నారు. బ్లాక్ ప్రింటింగ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్‌లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్ కాన్వాస్ బ్యాగులు, జెంట్స్ కుర్తాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయని అన్నారు. విశాఖపట్నం, ముంబై, విజయనగరం, సికింద్రాబాద్, ఫరీదాబాద్, విజయవాడ, కర్నూలు, దయాల్ బాగ్, బొల్లారం తదితర ప్రాంతాల్లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌ల విద్యార్థులు పాల్గొంటున్నారని వెల్లడించారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 19న చింతల్‌హనుమాన్ గుడి వద్ద, భగత్ సింగ్ నగర్ ప్రభుత్వ పాఠశాల, సోమయ్యనగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద, 20న రింగ్ బస్తీ కమ్యునిటీహాల్, 21న శివనగర్ కమ్యూనిటీహాల్, 22న మగ్దూం నగర్ గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసాన కౌంటర్లలో తమ సిబ్బందికి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని, ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

విపత్తులపై అవగాహన

సుభాష్‌నగర్: గాజులరామారంలోని తత్వ గ్లోబల్ స్కూల్‌లో శనివారం ప్రకృతి వైపరీత్యాల నివారణ సంస్థ (డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఎఫ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఎలా రక్షించుకోవాలన్న విషయంపై విద్యార్థులకు మాక్‌డ్రిల్ నిర్వహించి చూపించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఏదైనా విపత్తు సంభవించినపుడు డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని ముమ్మర సహాయక చర్యలు చేపడతాయని, ముఖ్యంగా ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా తన్నీరు, వైస్ ప్రిన్సిపాల్ పావని, ఉపాధ్యాయులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జ్‌గా నాగరాజ్

జగద్గిరిగుట్ట: తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం, ప్రైవేట్ టీచర్స్ వింగ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జ్‌గా నాగరాజు నియమితులయ్యారు. శనివారం జేఎన్‌టీయూలోని శ్రీకృష్ణ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వింగ్ ప్రెసిడెంట్ కార్తిక్ అజయ్ చేతుల మీదుగా నాగరాజు నియామక పత్రం అందుకున్నారు. కాగా నాగరాజు ప్రస్తుతం భూదేవి హిల్స్‌లోని బాలకృష్ణ స్కూల్‌లో పీఈటీగా పని చేస్తున్నారు.

వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: అణగారినవర్గాలకు మేలు చేసేందుకు కృషి చేసిన డా.బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నగరం నడిబొడ్డున ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ప్రతి ఇంటికి నీటిని ఇచ్చిన ఏకైన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కరెంటు కోతలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటే ఇప్పుడు పూర్తిగా అధిగమించామని జనరేటర్ల అవసరమే తెలంగాణలో లేదన్నారు.

బీజేపీది తప్పుడు ప్రచారం....

ప్రధాని మోదీ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా అన్ని తామే చేశామని చెప్పుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్‌లో మెట్రో సీఎం కేసీఆర్ కృషితోనే సాధ్యమైందన్నారు. ఓఆర్ఆర్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. హైదరాబాద్‌లో అనేక ఫ్లైఓవర్లు రాష్ట్ర నిధులతోనే పూర్తి చేసుకున్నామని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకుండా కేంద్రం మొండి చేయి చూపిస్తుందన్నారు. దేశ సంబంధను ఆదానీకి దోచి పెడుతోందని ప్రశ్నిస్తే సీబీఐ, ఈడీ ఐటీ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి...

ప్రభుత్వంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసే విమర్శలను ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎవరి స్థాయిలో వారు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలను అందరిని కలుపుకునిపోవాల్సిన అవసరం అందరినిపై ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుపోవాలి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవనే నిజాన్ని ప్రజలకు అర్థం అయ్యే విధంగా వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వివేకానంద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం....

పార్టీకి కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఇది తమ బాధ్యత ఎమ్మెల్యే వివేకాంద్ అన్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలకు సైతం తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పరిస్థితులను బట్టి అందరికి పార్టీ పదవుల్లో,ఇతర అవకాశాల్లో తప్పకుండా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి, చల్లా సుధీర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై వంద రోజుల స్పెషల్ డ్రైవ్

కుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్యారోగ్యాధికారి రజనీకాంత్



కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్ విషయంపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించే సమస్యే లేదని కుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్య ఆరోగ్య అధికారి రజనీకాంత్ అన్నారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల పరిధిలో పర్యటించి శానిటరీ సూపర్వైజర్ల పనితీరుపై ఆరా తీశారు. అదే విధంగా గ్రేటర్ కమిషనర్ లోకేష్‌కుమార్ ఆదేశాలతో 100 రోజుల పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ‘సాక్షి’తో మాట్లాడారు.

◆ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి 7గంటల వరకు మొదటి దశ చెత్తను తొలగించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెండో దశలో 12గంటల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం కార్మికులు బయోమెట్రిక్ ద్వారా హాజరు శాతం పరిశీలించి ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నాలుగు డివిజన్లో వారు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారన్న విషయాలను పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. బయోమెట్రిక్ అనంతరం ఎవరైనా హాజరు కానట్టు తేలితే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

◆ మొత్తం 22 మంది శానిటరీ సూపర్వైజర్ల పర్యవేక్షణలో 67 గ్రూపుల పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తూ వస్తున్నారని అన్నారు. ప్రతిరోజు వీరి పనితీరు ఆధారంగా నివేదిక తయారు చేస్తూ ఉన్నత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, ఉప కమిషనర్ మంగతాయారు ఆదేశాలతో కొన్ని కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చెత్తాచెదారాలను తొలగిస్తూ, అక్కడక్కడ ఫిర్యాదుల విషయంపై దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులు, సానిటరీ సూపర్వైజర్లు ఎక్కడైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిస్తే మాత్రం వారిపై కఠినంగా వ్యవహరించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంపై నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులను వేగంగా పూర్తి చేయాలి



కౌసల్య కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనుల వద్ద నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి కౌసల్య కాలనీలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శనివారం కౌసల్య కాలనీలో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో రూ.84 కోట్ల నిధులతో 9 ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ పనులు ప్రారంభమై రెండేళ్లయ్యిందన్నారు. అయినా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా అలైన్మెంట్లు మార్చడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని అన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ప్రజాప్రతినిధులకు ఎస్ఎన్‌డీపీ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయడంతో చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ బీజేపీ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి గొల్ల కృష్ణ, ప్రసాద్‌రాజు, శేషారావు, విజయ్‌కుమార్, సురేశ్, రాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ గంగారాం

కుత్బుల్లాపూర్: మత్తుపదార్థాల విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరి నుంచి 12 గ్రాముల ఎండీఎంను బాలానగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ గంగారాం వివరాలు వెల్లడించారు. యూసఫ్‌గూడకు చెందిన క్రాంతికుమార్ (24) ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ (24) ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తుపదార్థాల విక్రయిస్తున్నారు.

◆ శనివారం మత్తుపదార్థాల విక్రయాలపై సమాచారం అందుకున్న బాలానగర్ జోన్ ఎస్ఓటీ, బాలానగర్ పోలీసులు బాలానగర్‌లోని నర్సాపూర్ క్రాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న క్రాంతికుమార్, దుర్గా ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. 12 గ్రాములు ఎండీఎం పట్టుబడింది. నిందితులను తమదైన శైలిలో విచారించగా బెంగళూరు నుంచి ఎండీఎంను కొనుగోలు చేసి నగరంలో విక్రయాలు చేపడుతున్నట్లు అంగీకరించారు.

◆ ఈ మేరకు నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మత్తుపదార్థాల విక్రయదారులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ ఎస్సై శరత్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ గంగారామ్ అభినందించారు.

సర్వతోముఖాభివృద్ధి దిశగా తెలంగాణ



ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, సురేందర్‌నగర్‌లలో ఆయన మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్ బదిలీ వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

◆ పద్మానగర్ ఫేజ్–2లోని శ్రీ గంగా లలితాకామేశ్వరి సమేత శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ త్రయోదశ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంబేద్కర్‌నగర్‌లోని మజీద్–ఏ–మొహమ్మదీయ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 19 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చాయి. కోవిడ్ కేసులు పెరుగుతన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడంతో పాటు చేతులను తరచు శానిటైజ్ చేసుకోవాల్సిందిగా వైద్యాధికారులు సూచిస్తున్నారు.

నిరాహార దీక్షకు నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలి

రంగారెడ్డినగర్: టీ–సేవ్ ఉద్యమంలో భాగంగా ఈనెల 17 సోమవారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల నేతృత్వంలో అఖిల పక్షం పార్టీలు, నిరుద్యోగులతో కలిసి నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమానికి నిరుద్యోగులు, వైఎస్సార్‌టీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తులతో పాటు పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంగరంగ వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శ్రీనివాసకాలనీలోని భూనీలా సమేత శ్రీవెంకటశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. ఈ కల్యాణంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ ప్రణయ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజలో కార్పొరేటర్ రాఘవేంద్రరావు, అలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంజయ్యనగర్‌లో..

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సాయం

సుభాష్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సూరారం కార్పొరేషన్ సత్యనారాయణ అన్నారు. న్యూశివాలయనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కిష్టయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్యనారాయణ శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్ రెడ్డి, చౌడయ్య, మహిపాల్‌రెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

దుండిగల్: వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. దుండిగల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఓపీ, ఐపీ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, శస్త్ర చికిత్సలు, రికార్డుల పరిశీలన, మందులు తదితరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక కేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలను మండల వైద్యాధికారిణి డాక్టర్ వై.నిర్మల ఆయనకు వివరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్.329 ప్రభుత్వ స్థలంలో వెలసిన పలు నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థానికంగా ప్రభుత్వ స్థలంలో శుక్రవారం రాత్రి నిర్మాణాలు చేపట్టారని సమాచారం రావడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ రెడ్డి నేతృత్వంలో శనివారం 2 గదులు, ఒక షెడ్డు, 4 బేస్‌మెంట్లను నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతల్లో వీఆర్ఏ వాసు, దేవ, నాగులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడిన వాళ్లమవుతాం

జగద్గిరిగుట్ట: రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడిన వాళ్లమవుతామని జగద్గిరిగుట్ట సీఐ సైదులు అన్నారు. నీలోఫర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జగద్గిరిగుట్లోని ఎంకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 180 మంది పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జగద్గిరిగుట్ట సీఐ సైదులు చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు.

హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

నిజాంపేట్: నిజాంపేట్‌లోని భండారి లేఅవుట్‌లో శనివారం భండారి లేఔట్ సంక్షేమ సంఘం, బ్లాసమ్స్ ప్లానెట్ స్కూల్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన తల్లి, పిల్లల హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక కార్పొరేటర్ ఎల్లం బాయి జ్యోతి, 29వ డివిజన్ కార్పొరేటర్ బొర్రాదేవి లు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించగా చీఫ్ గైనకాలజిస్ట్, ఓబెస్ట్రీషన్ డాక్టర్ అల్లూరి విజయలక్ష్మి, పీడియాట్రీషన్ డాక్టర్ నాగేంద్ర వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు బ్రెస్ట్ కేన్సర్, సర్వేకల్ కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, కాలనీ వాసులు తదతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుండిగల్: ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుండిగల్ మూడవ వార్డులో నివసించే మామిడి సంతోష్(35) ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఇతనికి నాలుగు సంవత్సరాల క్రితం ఓ యువతితో వివాహమైంది. పెళ్లినైప్పటి నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో మూడేళ్ల క్రితం భర్తను వదిలేసి వెళ్లిపోయింది. దీంతో సంతోష్ అప్పటి నుంచి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రిల్లో సైతం చూపించగా ప్రస్తుతం మందులు వాడుతున్నాడు. ఈక్రమంలో ఈ నెల 11వ తేదీన సంతోష్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పేసి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐస్‌క్రీమ్ కంపెనీ సీజ్

వేసవిని క్యాష్ చేసుకునేందుకు నాణ్యత లేని ఐస్‌క్రీమ్ తయారీ



కుత్బుల్లాపూర్: ఎలాంటి నాణ్యత ప్రమాణాలు లేని ఐస్ క్రీమ్ తయారు విక్రయిస్తున్న ఓ ఐస్ క్రీమ్ కంపెనీపై మేడ్చల్ డివిజన్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి సీజ్ చేశారు. సుమారు రూ.8.5లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయించారు.

◆ దూలపల్లి గ్రామానికి అనుకొని ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద గత ఐదు సంవత్సరాలుగా గుట్టుచప్పుడు కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా ఐస్ క్రీమ్ తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయంపై కొన్ని రోజులుగా నిఘా పెట్టిన ఎస్ఓటీ సీఐ జేమ్స్ బాబు సిబ్బందితో శనివారం దాడి చేశారు. అనుమతులు లేకుండా నాసిరకమైన పదార్థాలతో ఐస్ క్రీమ్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే సదరు నిర్వాహకుడు గొల్ల అంకయ్య(58)ని అదుపులో తీసుకున్నారు. అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకొని కంపెనీ సీజ్ చేశారు.

◆ నగరం నగర శివారు ప్రాంతాల్లో వేసవి కాలం కావడంతో ఇలాంటి నాసిరకమైన ఐస్‌క్రీమ్ తయారు చేసి విక్రయిస్తున్నారని అన్నారు. ఎవరికైనా అనుమానంగా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని జేమ్స్ బాబు కోరారు. శుక్రవారం చందానగర్‌లో నకిలీ ఐస్ క్రీమ్ తయారు చేస్తూ పట్టుబడ్డ విషయం మరవక ముందే దూలపల్లిలో మరో ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది.